'బతుకమ్మ'ను మరిచిన సర్కార్!

- కనీస ఏర్పాట్లు చేయని ప్రభుత్వం
- నిర్లక్ష్యంపై ఆడబిడ్డల మండిపాటు
- 'కూల్చివేతల సంబురం'లో బతుకమ్మను మరిచారని ఫైర్
- కేవలం శుభాకాంక్షలతో సరిపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అంటే బతుకమ్మ! బతుకమ్మ అంటే తెలంగాణ! ఈ ప్రాంత ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచి.. ఉద్యమ చైతన్య గీతికై ఎగిసి.. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రపంచ ఖ్యాతి గాంచిన మన బతుకమ్మ పండుగను కాంగ్రెస్ సర్కార్ మరిచిపోయింది. నేటి ఎంగిలిపూల నుంచి మొదలయ్యే ఆడబిడ్డల అతి పెద్ద వేడుకకు కనీస ఏర్పాట్లు చేయకుండా చిన్నచూపు చూస్తున్నది. ఎన్నికల్లో మహిళలకు అలవిగాని హామీలిచ్చి వారి ఓట్లతో అందల మెక్కి ఇప్పుడు ఆడబిడ్డలు ఘనంగా జరుపుకొనే బతుకమ్మనే పక్కనపెట్టేసింది. 'కూల్చుడు సంబురం'లో పడి 'బతుకమ్మ సంబురాల'ను మరుగున పడేసింది.

- బొడ్డెమ్మ వేడుకపై నిషేధమా?

మహబూబాబాద్ జిల్లా గూడూరులో బొడ్డెమ్మ ఊరేగింపును పోలీసులు అడ్డుకున్నారు. గూడూరు, గొల్లగూడెం, చంద్రుగూడెం గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం బొడ్డెమ్మ నిమజ్జనానికి వాహనాల్లో వెళ్తుండగా ఎస్సై గిరిధర్ అడ్డుకోవడంతో ఫారెస్టు ఆఫీసు వద్ద రోడ్డుపై బైఠాయించారు. అర్ధరాత్రి 11.30 గంటల వరకూ ఆందోళన చేపట్టారు.

నేటి నుంచే బతుకమ్మ సంబురాలు

తెలంగాణ అంతటా నేటి (బుధవారం) నుంచి బతుకమ్మ సంబురాలు మొదలు కానున్నాయి. ఎంగిలిపూల నుంచి సద్దుల బతుకమ్మ దాకా ఇంటింటా పూలసింగిడి పరుచుకోనున్నది. ఊరూవాడా ఆడబిడ్డల ఆటపాటలతో తెలంగాణ అంతా మురిసిపోనున్నది. కానీ, మన రాష్ట్రానికే ప్రత్యేకమైన ఈ పండుగకు రేవంత్‌రెడ్డి సర్కార్ కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మాట వరుసకైనా ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, ఆ శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇలా ఏ స్థాయిలోనూ బతుకమ్మ పండుగపై సమీక్ష నిర్వహించిన దాఖలాల్లేవు. పండుగ నిర్వహణ కోసం ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. ఆలయాలు, ఊరుమ్మడి స్థలాలు, చెరువు గట్లు విద్యుద్దీపాల అలంకరణతో బతుకమ్మ కాంతులీనుతుంది. ఆయా చోట్ల ఏర్పాట్లపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయలేదు.

కూల్చుడుపైనే శ్రద్ధా?

కాంగ్రెస్ సర్కార్‌కు కూల్చుడు మీద ఉన్న శ్రద్ధ బతుకమ్మ పండుగ మీద లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైడ్రా పేరుతో మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వం ఇండ్లను కూల్చి కుప్పపోస్తున్నది. కానీ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ నిర్వహణ విషయంలో ఏ మాత్రం పట్టింపు లేదని ఆడబిడ్డలు ఆవేదన చెందుతున్నారు. పితృ అమావాస్య ప్రారంభమయ్యే పది రోజుల ముందే ఏర్పాట్లకు సంబంధించిన మొత్తాన్ని గత ప్రభుత్వం విడుదల చేసేది. కానీ, ఇప్పుడు యంత్రాంగం, మంత్రాంగం అంతా హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ చర్యల్లో తలమునకలయ్యాయి. పండుగ ఏర్పాట్లపై సమీక్షించే తీరిక కూడా లేకుండా బిజీ అయ్యాయి.

ఇప్పటికే చీరలు ఎగ్గొట్టి

బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ (తెల్లరేషన్‌కార్డు/ఫుడ్‌సెక్యూరిటీ కార్డు ఉన్నవారికి) బతుకమ్మ పండుగకు పది రోజుల ముందే చీరలు పంపిణీ చేసేది. ఏడెనిమిది నెలల ముందు చేనేత కార్మికులకు చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చేది. కానీ, ఈసారి చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వక వారి ఉపాధిని కాంగ్రెస్ సర్కార్ దెబ్బతీసింది. ఆడబిడ్డలకు చీరల పంపిణీ కానుకను ఎత్తగొట్టింది. సీఎం రేవంత్ రెడ్డి కేవలం రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనతో సరిపెట్టారు. 'బతుకమ్మ పండుగ అంటే కొండంత సంబురం. పండుగకు ముందే కేసీఆర్ కంట్రోల్ షాపులకు ముందే చీరలు పంపేటోడు. షాపోళ్లు అందర్నీ పిలిచి ఇచ్చేటోళ్లు. ఈపాలి ఏదీలేదు. నెత్తికొరిగి కొప్పేత్త..కొప్పుమీద బోనం ఎత్తుత' అన్నట్టే కాంగ్రెసోళ్ల ముచ్చట ఉన్నది' అని నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన వృద్ధురాలు మణెమ్మ కాంగ్రెస్ సర్కార్ తీరును ఒక్కముక్కలో వివరించింది.

మన సాంస్కృతిక జీవన ప్రతీక బతుకమ్మ

- మహిళా సామూహిక శక్తికి.. ఐక్యతకు దర్పణం
- తెలంగాణ ఆడబిడ్డలకు కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతి, సంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకున్నదని తెలిపారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ సందర్భంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఆడబిడ్డలు, పిల్లాపాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను గుర్తించిన నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని వివరించారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను ఆటపాటలతో, ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని తెలంగాణ ఆడబిడ్డలను కేసీఆర్ కోరారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతిమాత బతుకమ్మ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ బోగస్!

- 42% బీసీ రిజర్వేషన్ల హామీని అటకెక్కించే కుట్ర
- బీసీలకిచ్చిన ఇతర హామీలు అమలు చేసేదాకా పోరు
- శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి
- అసెంబ్లీ మీడియా హాలులో బీసీ నేతలతో సమాలోచన

హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్.. బోగస్ అని శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. శాసనమండలి మీడియా హాలులో మంగళవారం బీసీ నేతలతో సమావేశమై బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలపై ఆయన సమాలోచనలు జరిపారు. అధికారంలోకి రాగానే అన్ని వర్గాలనూ మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీలనూ వంచించే ఎత్తులు వేస్తున్నదని ధ్వజమెత్తారు. న్యాయస్థానాల తీర్పులు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఎగ్గొట్టే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. బీసీలను బోల్తా కొట్టించాలనే కాంగ్రెస్ పార్టీ కుయుక్తులను ఎప్పటికప్పుడు ఎండగట్టి, బీసీలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేదాకా బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, ఎల్ రమణ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆరు నెలల్లో అమలు చేస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. 42% బీసీ రిజర్వేషన్లతోపాటు బీసీలకు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు ప్రభుత్వం వెంటపడతామని హెచ్చరించారు. సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ బడుగు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వీ ప్రకాశ్, జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, నాగేందర్‌గౌడ్, పుటం పురుషోత్తమరావు, పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి గెలుపుతో సంబురాల్లో మునిగిపోయిన గులాబీ శ్రేణులు, కార్మికులు

గెలుపొందిన సూర్యప్రకాశ్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

- 'సూర్యలత' కాటన్‌మిల్ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి గెలుపు
- సీఎం ఇలాకాలో ఐఎన్‌టీయూసీ అభ్యర్థిపై 68 ఓట్ల తేడాతో విజయం
- బీఆర్‌ఎస్ సంబురాలు.. హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి, అక్టోబర్ 1: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ సమీపంలోని సూర్యలత కాటన్ మిల్ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొక్కబోర్లా పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాకాలో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో హస్తం పార్టీ కార్మిక యూనియన్ ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు 68 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. మిల్లులో మొత్తం 450 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా.. అందులో 438 మంది ఓటేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోలైన ఓట్లను లెక్కించారు. 438 ఓట్లలో బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావుకు 251 ఓట్లు, ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌కు 183 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు చెల్లుబాటు కాలేదు. 68 ఓట్ల తేడాతో బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు సూర్యలత స్పిన్నింగ్ మిల్లు గుర్తింపు కార్మిక అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు కార్మిక శాఖ అధికారులు ప్రకటించారు.

మిన్నంటిన బీఆర్‌ఎస్ సంబురాలు

బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు గెలుపొందినట్టు కార్మిక శాఖ అధికారులు ప్రకటించిన వెంటనే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు మిన్నంటాయి. కార్మికులు, గులాబీ శ్రేణులు నినాదాలు చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన సూర్యప్రకాశ్‌రావును మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు అభినందించారు.

ప్రతి ఎన్నికల్లో ఇవే ఫలితాలు : మాజీ ఎమ్మెల్యే జైపాల్

విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కార్మికులను, బీఆర్‌ఎస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి ఫలితాలే వస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురిచేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో కాంగ్రెస్ పార్టీకి కార్మికులు కర్రుకాల్చి వాతపెట్టారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చారని, అయినా వారు నమ్మలేదని వివరించారు. రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయమని జైపాల్ పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను పాతాళంలోకి తొక్కాలని జైపాల్ పిలుపునిచ్చారు.

తెలంగాణ సాధన పోరాటానికి గాంధీ స్ఫూర్తి

గాంధీ జయంతి సందర్భంగా స్మరించుకున్న కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దేశ స్వాతంత్ర్య సాధన కోసం సాగిన మలి దశ పోరాటాన్ని శాంతియుతంగా నడిపి, గమ్యాన్ని చేరుకున్న జాతిపిత మహాత్మాగాంధీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి, తెలంగాణ సాధన కోసం తాను సాగించిన మలిదశ పోరాటంలో ఇమిడి ఉన్నదని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన కృషిని, త్యాగాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. బాధితులకే సహనం ఎక్కువగా ఉండాలని, శాంతియుత మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి విజయం సాధించేందుకు మార్గం సుగమం అవుతుందనే గాంధీజీ కార్యాచరణ తన తెలంగాణ ఉద్యమ పంథాను ముందుకు నడిపించిందని తెలిపారు. భారత ప్రజలు మెచ్చేలా శాంతియుతంగా పార్లమెంటరీ పంథాలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అనతికాలంలోనే దేశం గర్వించే దిశగా అభివృద్ధి పథంలో నిలిపిన నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ కృషి వెనుక గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని వివరించారు.

సద్దుల బతుకమ్మను సెలవుగా ప్రకటించాలి

టీఎస్ సెక్రటేరియట్ అసోసియేషన్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మహిళలు పవిత్రంగా జరుపుకొనే సద్దుల బతుకమ్మను ప్రభుత్వం అధికారిక సెలవుగా ప్రకటించాలని తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) కోరింది. వారు మంగళవారం సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 10న(గురువారం) ఐచ్ఛిక సెలవుగా కాకుండా, అధికారిక సెలవుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూళ్లకు దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు బుధవారం నుంచి దసరా సెలవులు ప్రకటించారు. మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14 (సోమవారం) వరకు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విధిగా ఉత్తర్వులను పాటించాలని సూచించారు.

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు.

దీక్ష కేవలం లడ్డూ కోసమే కాదు..

ప్రాయశ్చిత్త దీక్ష లడ్డూ కోసమే కాదని, శాశ్వత పరిష్కారం కోసం చేపట్టానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. దీక్ష విరమణ కోసం తిరుమలకు బయల్దేరిన ఆయన మంగళవా రం మీడియాతో మాట్లాడారు. కాగా, 'కొత్త భక్తుడికి పంగనామాలెక్కువ!.. కదా?.. ఇక చాలు.. ప్రజల కోసం చె య్యవలసిన పనులు చూడండి' అంటూ నటుడు ప్రకాశ్‌రాజ్ సెటైర్ వేశారు.

హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం

- ర్యాలీల్లో ఫైర్ క్రాకర్స్‌పైనా బ్యాన్
- హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు
- ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, రూ.లక్ష జరిమానా

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో డీజేలు, ఫైర్‌క్రాకర్స్‌పై పోలీసులు నిషేధం విధించారు. శబ్దకాలుష్యానికి కారణం అవుతున్నందున వాటిని నిషేధిస్తూ హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజేలు, ఫైర్ క్రాకర్స్‌పై డయల్ 100కు ఫి ర్యాదులు రావటంతో నగరంలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, మతపెద్దలతో ఇటీవల సీవీ ఆనంద్ సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీజేలు, సౌండ్ మిక్సర్లు, హై సౌండ్ ఎక్విప్‌మెంట్ పరికరాలపై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్టు ప్రకటించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంట ల వరకు ఈ నిషే ధం అమల్లో ఉం టుందని స్పష్టంచేశారు. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతించనున్నారు. దవాఖానలు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు 100 మీటర్ల దూరం వరకు డీజేపై నిషేధం అమలులో ఉంటుంది. మతపరమైన ర్యాలీల్లో ఎలాంటి డీజేను వాడకూడదు. సౌండ్ సిస్టంను పరిమిత స్థాయిలో అనుమతిస్తారు. సౌండ్ సిస్టమ్ పెట్టడానికీ పోలీస్ క్లియరెన్స్ ఉండాలి. అటు.. నాలుగుజోన్లలో సౌండ్ సిస్టం జనావాసా ల ప్రాంతంలో ఉదయం 55 డెసిబుల్స్, రాత్రివేళల్లో 45 డెసిబుల్స్‌కు మించకూడదు. మతపరమైన ర్యాలీల్లో బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారు. పదేపదే ఉల్లంఘిస్తే ప్రతి రోజు రూ.5 వేల ఫైన్ వేస్తారు.

ఎస్సీ గురుకుల సొసైటీ అదనపు కార్యదర్శిపై వేటు!

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ సొసైటీ అదనపు కార్యదర్శి హన్మంత్ నాయక్‌పై ప్రభుత్వం వేటు వేసింది. సచివాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఇటీవల సొసైటీలో జరిగిన బదిలీలు, పదోన్నతులు వివాదాస్పదమవడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. హన్మంత్‌నాయక్ ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కాగా, డిప్యూటేషన్‌పై గురుకుల సొసైటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్, టెండర్లు తదితర కీలక విభాగాలన్నీ ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులు వివాదాస్పదంగా మారాయి. ఆయనపై ఆరోపణలు చేస్తూ ఏకంగా పలు సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి, పలు సమీక్షా సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం హన్మంత్ నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అడ్మిషన్లపై కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆయనపై గుర్రుగా ఉన్నారట. సీట్లు ఖాళీగా ఉన్నా ఇవ్వడం లేదని ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో హన్మంత్ నాయక్‌పై వేటు పడిందని సొసైటీలో చర్చించుకుంటున్నారు.

రుణమాఫీ పూర్తికాలె

- ప్రక్రియ కొనసా..గుతూనే ఉన్నది
- కుటుంబ నిర్ధారణ చేస్తూనే ఉన్నాం
- 2లక్షల పైన ఉన్న రైతులకు షెడ్యూలు ఇస్తాం
- మీడియా సాక్షిగా మంత్రి తుమ్మల ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ):'భూమి ఉండి, రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తున్నాం...' ఇదీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల రుణమాఫీ వివరాలు వెల్లడిస్తూనే.. రుణమాఫీ ప్ర క్రియ ఇంకా పూర్తి కాలేదని, ప్రక్రియ కొనసాగుతూనే ఉంటదని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో గత ఐదేండ్లుగా పంట రుణం తీసుకున్న 42లక్షల మంది రైతుల వివరాలను బ్యాంక ర్లు ప్రభుత్వానికి అందించారని చెప్పారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో భూమి ఉండి రుణాలు తీసుకున్న రైతుల సం ఖ్య 60 లక్షలుగా ఉన్నట్టు గతంలో స్వయం గా వెల్లడించారు. ఒకవేళ మంత్రి తుమ్మల చెప్పినట్టుగా 42 లక్షల మంది రైతుల వివరాలు బ్యాంకులు అందిస్తే ఆగస్టు 15లోపు 31వేల కోట్లు రుణమాఫీ కావాలి. కానీ కఠిన నిబంధనలు పెట్టి సుమారు 20 లక్షల మంది రైతులను రుణమాఫీకి దూరం చేసిందనే వాస్తవాన్ని కప్పిపుచ్చారు. మిగిలిన రైతులకు ఎప్పటివరకు మాఫీ చేస్తారో చెప్పకపోవడం గమనార్హం. 2 లక్షల లోపు రుణమాఫీలో ఇంకా 4 లక్షల మందికి కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉండగా 3.5 లక్షల మందికి కుటుంబ నిర్ధారణ జరిగినట్టు తెలిపారు. ఇక రూ. 2 లక్షలకు పైగా రుణమాఫీపై 'తాము షెడ్యూల్ ప్రకటిస్తామని, అప్పుడు 2లక్షలకు పైగా రుణం చెల్లిస్తే.. 2లక్షలు వారి ఖాతాలో జమ చేస్తాం' అని పేర్కొన్న తుమ్మల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిస్తారో మాత్రం చెప్పలేదు.

రుణమాఫీ పూర్తయ్యేదెన్నడో ?

100 రోజుల్లో రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. 300 రోజులు గడుస్తున్నా పూర్తి చేయలేదు. మంత్రి తుమ్మల చెప్పిన ప్రకారం.. 'మా ప్రభుత్వానికి ఇది మొదటి ఏడాదే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీకు తెలిసిందే.. మొదటి ఏడాది కొంతచేశాం.. మిగిలిన రుణమాఫీ ప్రక్రియను కొనసాగిస్తాం' అన్నారు. ఐదేండ్లు ప్రహసనంలా కొనసాగిస్తారా ? అని రైతులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

6 నుంచి సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ బంద్

టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: రాజన్న సిరిసిల్ల తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, దీంతో ఈ నెల 6 నుంచి పార్క్‌ను బంద్ చేస్తామని టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశ్రమల యజమానులు మాట్లాడుతూ.. కొద్ది నెలలుగా తీవ్రమైన మాంద్యం నెలకొన్నదని, సంక్షోభంలో కూడా రెండు నెలలుగా నష్టాలను ఎదుర్కొని పరిశ్రమలు నడిపించామని, ఇక నడిపించే పరిస్థితి లేదని వాపోయారు. సభ్యుల సమక్షంలో పరిశ్రమలు బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ నిర్ణయాన్ని కార్మికులు సహృదయంతో అంగీకరించాలని కోరారు. సమావేశంలో సెక్రటరీ అంకారపు కిరణ్, ఉపాధ్యక్షుడు యేముల శ్రీనివాస్, ట్రెజరర్ యెల్లె లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ శివకుమార్, సూర్య, నర్సింగం, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేసేవరకు ఊరుకోం

- రైతు భరోసా ఇవ్వాల్సిందే
- రేవంత్ పాలనపై జనం విసుగు
- ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైంది
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరిక
- రుణమాఫీ కోసం పెద్దపల్లిలో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ

పెద్దపల్లి, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాల్సిందేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, రైతు భరోసా అంటూ మాయమాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ రైతులను నిట్ట నిలువునా ముంచేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక కొర్రీలు పెట్టి రుణమాఫీకి ఎగనామం పెట్టిందని మండిపడ్డారు. రూ.2 లక్షలలోపు రైతు రుణాలన్నీ మాఫీ చేయాలని, రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని రంగంపల్లి జియో పెట్రోల్ బంక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. కొప్పులతోపాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కాంగ్రెస్ సర్కార్, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ జల్ద అరుణశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. తొమ్మిది నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరాచకాలను ప్రజలు చూశారని, ఇక రేవంత్‌రెడ్డి ఆటలు సాగవని హెచ్చరించారు. హైడ్రా భయంతో తెల్లారితే ఏం జరుగుతుంతో తెలియని భయానక వాతావరణంలో హైదరాబాద్ ప్రజలు బతుకున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి అస్తవ్యస్త పాలనపై విసిగి చెంది జనం తిరగబడేందుకు సిద్ధమవుతున్నారని హెచ్చరించారు.

పంచాయతీల్లో మహిళా ఓటర్లే అధికం

- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.67 కోట్ల మంది ఓటర్లు
- 12,867 పంచాయతీల్లో 1.13 లక్షల వార్డులు
- నల్లగొండ జిల్లాలో అత్యధికం.. మేడ్చల్‌లో అత్యల్పం

జిల్లాలు	పంచాయతీలు	వార్డులు	ఓటర్లు
నల్లగొండ	856	7,392	10,42,545
సంగారెడ్డి	646	5,718	8,34,360
ఖమ్మం	589	5398	8,52,878
వికారాబాద్	585	4982	6,71,940
రంగారెడ్డి	549	4896	7,94,653
హన్మకొండ	210	1986	3,65,832
ములుగు	174	1556	2,37,858
మేడ్చల్	34	320	64,397



హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లు ఉన్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో పురుషులు 82,04,518 మంది, స్త్రీలు 85,28,573, ట్రాన్స్‌జెండర్లు 493 మంది ఉన్నారు. రాష్ట్రంలోని 538 మండలాల్లోని 12,867 గ్రామ పంచాయతీల్లో 1,13,722 వార్డుల్లో ఉన్న ఓటరు జాబితాలను అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ ఓటరు జాబితా ప్రకారమే పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. వార్డుల సంఖ్యను తెలుపోవడంతో మరో 40 గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రకటించలేదు. రాష్ట్రంలో అత్యధికంగా పంచాయతీలు, వార్డులు, ఓటర్ల సంఖ్యా పరంగా నల్లగొండ, సంగారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ముందుండగా, హన్మకొండ, ములుగు, మేడ్చల్ మల్కాజిరిగి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నాయి.

ఇద్దరికి మించి పిల్లలున్నా పోటీకి అర్హులే?

- చట్టసవరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- త్వరలో సర్కారు ఉత్తర్వులు?

హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పోటీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిం ది. ఈ మేరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసింది. ఈ చట్ట సవరణ కు గవర్నర్ ఆమోద ముద్ర వేయాల్సి ఉన్నదని సమాచారం. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారికి ఇప్పటివరకు పోటీ చేసే అవకాశం లేకుండా గతంలో చట్టంచేశారు. కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారికి కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలని సర్కారు నిర్ణయించింది. దీనిపై అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ కానున్నాయి.